# సాక్షి
## కుమురం భీం

సోమవారం । 11 । నవంబర్ । 2024






**ముగిసిన రాష్ట్రస్థాయి పోటీలు**

68వ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు ముగిశాయి. ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్ -19 విభాగంలో బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. 8లో▸



**పంటలను రక్షించేదెలా..?**

జిల్లాలో అడవిపందుల బెడద తీవ్రంగా ఉంది. పత్తి, వరి, కంది పంటలకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. పూత, కాత దశలో పంటలను నాశనం చేస్తున్నాయి. 9లో▸

**వాతావరణం**

గరిష్టం/కనిష్టం
31.1 /18.1

చాలా వరకు ఎండగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. తెల్లవారుజామున చల్లగా ఉంటుంది. మంచు కురుస్తుంది.

# నాటుపడవల్లో దేశీ సరుకు



ఈ నెల 9న చింతలమానెపల్లి మండలం గూడెం గ్రామానికి చెందిన పర్వతాల ప్రవీణ్, ఆటోడ్రైవర్ అగాడి కొండయ్య, కౌటాల మండలం తుమ్మిడిహెట్టికి చెందిన ఒడిల ప్రకాశ్ చంద్రపూర్ జిల్లా బంగారీ తర్విడి ప్రాంతానికి వెళ్లి దేశీదారు మద్యం కొనుగోలు చేశారు. అంతర్రాష్ట్ర రహదారుల్లో పోలీసు చెక్‌పోస్టులు ఉండడంతో నాటుపడవ సాయంతొ నది దాటించి మద్యాన్ని కౌటాల మండలం తుమ్మిడిహెట్టికి తరలించారు. అక్కడి నుంచి ఆటోలో గూడెం మీదుగా గడ్చిరోలి జిల్లాలో అహేరికి తీసుకెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. పక్కా సమాచారంతో శనివారం వేకువజామున ఎస్సై ఎస్.మధుకర్, సిబ్బంది తుమ్మిడిహెట్టి వద్ద రూ.1.80 లక్షల విలువైన 20 బాక్సుల దేశీదారు మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆటో, మద్యం సీజ్ చేసి ముగ్గురిపై కేసు నమోదు చేశారు.

- మహారాష్ట్రలో ఎన్నికల కోడ్‌తో జోరుగా దందా
- ప్లాస్టిక్ సీసాల్లో దేశీదారు మద్యం
- తనిఖీలకు చిక్కకుండా జలమార్గం ద్వారా అక్రమ రవాణా
- నిఘా పెట్టని ఎక్సైజ్ అధికారులు



ప్లాస్టిక్ సీసాల్లో దేశీదారు మద్యం(ఫైల్)

**కౌటాల(ఆసిఫాబాద్):** మహారాష్ట్ర ఎన్నికలు కొందరికి బంగారు బాతులా మారాయి. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అక్రమ దందాలకు తెరలేపారు. మహారాష్ట్రలో అతిచౌకగా లభించే దేశీదారు మద్యాన్ని తరలించి భారీ లాభాలు గడిస్తున్నారు. ముఖ్యంగా సిర్పూర్(టి) నియోజకవర్గం మహారాష్ట్ర సరిహద్దులో ఉండటం, చంద్రపూర్ జిల్లాను ఆనుకుని ఉండటం అక్రమార్కులకు కలిసివస్తోంది. ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు జిల్లాల పోలీసు అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించి కొత్త చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఇరురాష్ట్రాల పోలీసులూ తనిఖీలు ముమ్మరం చేశారు. దీంతో పోలీసులకు చిక్కకుండా అక్రమారులు జలమార్గాన్ని ఎంచుకున్నారు. ప్రస్తుతం దేశీదారు మద్యం ప్లాస్టిక్ సీసాల్లోనూ లభిస్తుండటంతో రవాణా మరింత సులువవుతోంది. రైళ్ల నుంచి తరలించే వారు మార్గమధ్యలోనే కావాల్సిన చోట ముందుగానే తమ మనుషులను ఉంచి విసిరేస్తున్నారు. అలాగే నదుల మీదుగా నాటుపడవల్లో సులువుగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఆబ్కారీ శాఖ నిఘా కొరవడిందనే విమర్శలు వస్తున్నాయి.

**సరిహద్దు గ్రామాల మీదుగా..**

2015లో మహారాష్ట్రలో అప్పటి ప్రభుత్వం చంద్రపూర్ జిల్లావ్యాప్తంగా సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేసింది. కానీ మళ్లీ 2021లో చంద్రపూర్ జిల్లాలో మద్యపాన నిషేధాన్ని పూర్తిగా ఎత్తివేశారు. కానీ అదే మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో ఇప్పటికీ నిషేధం కొనసాగుతోంది. మహారాష్ట్రలో దొరికే చౌకైన మద్యం దేశీదారుకు ఇరురాష్ట్రాల్లో ఆదరణ ఉంది. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు అక్రమంగా రవాణా చేస్తుంటారు. తెలంగాణ మద్యంతోపాటు దేశీదారును బెల్టు షాపుల్లో 24 గంటలపాటు అందుబాటులో ఉంచుతున్నారు. ప్రస్తుతం అక్కడ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మద్యానికి డిమాండ్ ఉంది. వరిధాన్యం, దేశీదారు, రేషన్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు జిల్లా పోలీసులు నాలుగు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. అంతర్రాష్ట్ర రహదారులపై చింతలమానెపల్లి మండలం గూడెం, సిర్పూర్(టి) మండలం వెంకట్రావ్‌పేట్, హుడ్కిలి వద్ద.. అలాగే జాతీయ రహదారిపై వాంకిడి వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం తనిఖీలు జోరుగా కొనసాగుతుండటంతో కొందరు అక్రమార్కులు మహారాష్ట్ర నుంచి సరిహద్దులో ఉన్న ప్రాణహిత నది మీదుగా నాటుపడవల్లో ప్రమాదకరంగా కౌటాల మండలంలోని సరిహద్దు గ్రామాలకు తరలిస్తున్నారు. ప్రాణహిత నదికి సరిహద్దున తుమ్మిడిహెట్టి గ్రామం ఉండగా.. వార్దా నదికి సరిహద్దుగా గుండాయిపేట, వీర్థండి, తాటిపల్లి గ్రామాలు ఉన్నాయి. సరిహద్దు గ్రామాలకు దేశీదారు మద్యం చేరుకోగానే నిషేధం అమలులో ఉన్న గడ్చిరోలి జిల్లాకు తరలిస్తూ అధికారులకు సవాలు విసురుతున్నారు.

### అందుబాటులోకి ప్లాస్టిక్ సీసాలు

దేశీదారు మద్యం గతంలో గాజు సీసాల్లో మాత్రమే లభించేది. ప్రస్తుతం చిన్నసైజ్ ప్లాస్టిక్ బాటిళ్లలో సైతం అందుబాటులో వచ్చింది. రవాణా చేయడం మరింత సులువుగా మారింది. మద్యం ప్లాస్టిక్ సీసాలను సంచుల్లో వేసుకుని రైళ్ల ద్వారా బల్లార్షా, చంద్రపూర్‌ల నుంచి తరలిస్తున్నారు. మరికొందరు రాత్రిపూట గుట్టుచప్పుడు కాకుండా ప్రాణాలకు తెగించి నాటుపడవల్లో ప్రాణహిత, వార్దా నదుల్లో మహారాష్ట్ర నుంచి జిల్లా సరిహద్దు దాటిస్తున్నారు. ప్లాస్టిక్ బాటిళ్లు కావడంతో నష్టం తక్కువగా ఉంటుంది. ముందే ఆయా ప్రాంతాల్లో వేచి ఉండే వారి సహాయకులు బాటిళ్ల సంచులను తీసుకుని వాహనాల్లో రహస్య ప్రదేశాలకు తరలిస్తున్నారు. అక్కడి నుంచి మద్య నిషేధం ఉన్న గడ్చిరోలి జిల్లాలోని అహేరి ప్రాంతానికి చేరవేస్తున్నారు. తనిఖీలు ఉంటే మార్గమధ్యలో చెట్ల పొదల్లో విసిరేసేందుకు కూడా వెనుకాడటం లేదు. తర్వాత మళ్లీ రాత్రిపూట వచ్చి తీసుకెళ్తున్నారు. రోడ్డు, రైలు మార్గాల్లో నిఘా పెరగడంతో ప్రస్తుతం జలమార్గాల్లో దందా కొనసాగిస్తున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు ఇప్పటికైనా సరిహద్దు ప్రాంతాలపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

### సరిహద్దు ప్రాంతాల్లో నిఘా



అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో నాలుగు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో తనిఖీలు చేపడుతున్నాం. అక్రమ దందాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. అలాగే ప్రాణహిత, వార్దా నదుల వెంబడి సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచాం.

– రామానుజం, డీఎస్పీ, కాగజ్‌నగర్

## న్యూస్‌రీల్

### సమన్వయంతో సర్వే పూర్తిచేయాలి



గంగాపూర్‌లో సర్వే పరిశీలిస్తున్న డీపీవో

**రెబ్బెన(ఆసిఫాబాద్):** సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేను అధికారులు సమన్వయంతో పూర్తిచేయాలని డీపీవో భిక్షపతి అన్నారు. ఆదివారం మండలంలోని గంగాపూర్‌లో సర్వే ప్రక్రియను డీపీవో పరిశీలించగా, మండల కేంద్రంలో తహసీల్దార్ రామ్మోహన్ రావు, గోలేటిలో ఎంపీడీవో శంకరమ్మ పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేటర్లు సేకరిస్తున్న కుటుంబ సభ్యుల వివరాలు, వాటి నమోదు తీరును పరిశీలించారు. ఎన్యుమరేటర్లు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన అన్నిరకాల వివరాలను ఫార్మాట్ ప్రకారం నమోదు చేయాలన్నారు. సర్వే సమయంలో సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజలు సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీవో వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా సమస్యలపై విస్తృత ఉద్యమాలు



మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

**కాగజ్‌నగర్‌రూరల్:** ప్రజా సమస్యలపై విస్తృత ఉద్యమాలు నిర్వహించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కామ్రేడ్ పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని రాయల్ గార్డెన్‌లో ఆదివారం సీపీఐ(ఎం) మూడో జిల్లా మహాసభలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం దేశం అనేక ఒడిదొడుకులు, సవాళ్లు ఎదుర్కొంటుందన్నారు. ప్రజల సమస్యలు నిరంతరం అధ్యయనం చేస్తూ ఉద్యమాలు నిర్వహించాలన్నారు. భారత రాజ్యాంగం, ధర్మశాస్త్రం మధ్య విస్తృతమైన చర్చ జరుగుతుందని తెలిపారు. బీజేపీ మతోన్మాద చర్యలకు పాల్పడుతూ పార్టీ అభివృద్ధికి వాడుకుంటుందని ఆరోపించారు. ఇలాంటి పోకడలను ప్రజల్లోకి తీసుకెళ్లి పోరాటాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్, నాయకులు సతీశ్‌కుమార్, సూర్యదేవర సత్యనారాయణ, కూశన రాజన్న, కోట శ్రీనివాస్, దుర్గం దినకర్, జిల్లా కమిటీ సభ్యులు ముంజం శ్రీనివాస్, ఆనంద్‌కుమార్, దుర్గం అనిత, సాయికృష్ణ, అశోక్, బక్కన్న, కార్తీక్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ‘హామీల అమలులో విఫలం’



మాట్లాడుతున్న కొత్తపల్లి శ్రీనివాస్

**ఆసిఫాబాద్‌అర్బన్:** ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం జిల్లా ఎన్నికల కార్యశాల నిర్వహించారు. రాష్ట్ర నాయకులు అరుణ్‌కుమార్ జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరుతో ప్రజలను ఇబ్బందులు పెడుతోందన్నారు. రాష్ట్రంలో అసమర్థ పాలన కొనసాగుతుందని విమర్శించారు. రానున్న స్థానిక ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీకి బుద్ధి చెబుతారన్నారు. జిల్లాలో 60వేల మందికిపైగా బీజేపీ సభ్యత్వం తీసుకోవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం మండల ఇన్‌చార్జీలుగా శ్రీశైలం, కిరణ్, సత్యనారాయణ, అరుణ్‌కుమార్, ప్రభాకర్‌గౌడ్, చాపిడే సత్యనారాయణ, మనోహర్‌గౌడ్, అరిగెల మల్లికార్జున్, బాలకృష్ణ, కోట్నాక విజయ్, సుచిత్, రమేశ్ గౌడ్, మల్లయ్య, కొంగ సత్యనారాయణ, బోనగిరి సతీష్‌బాబును నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి పోటీల్లో మూడోస్థానం



బహుమతి అందుకుంటున్న మహిళా జట్టు

**రెబ్బెన(ఆసిఫాబాద్):** హనుమకొండలోని నెహ్రూ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మహిళల జట్టు మూడోస్థానంలో నిలిచినట్లు బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.నారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం జరిగిన ఫైనల్‌లో జిల్లా జట్టు ఖమ్మం జిల్లా జట్టుతో తలపడగా హోరాహోరీ పోరులో ఖమ్మం జట్టు స్వల్ప తేడాతో విజయం సాధించింది. దీంతో జిల్లా మహిళల జట్టు మూడోస్థానం కోసం నల్గొండ జట్టుతో తలపడింది. ఈ పోటీల్లో జిల్లా జట్టు విజయం సాధించింది. రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు మూడోస్థానంలో నిలవడంపై అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్.తిరుపతి, షార్ప్ స్టార్ బాల్‌బ్యాడ్మింటన్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి శంకర్, పీఈటీ భాస్కర్ తదితరులు హర్షం వ్యక్తం చేసి జిల్లా క్రీడాకారులను అభినందించారు.

### కరాటేలో కాగజ్‌నగర్ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

**కాగజ్‌నగర్‌రూరల్:** ఫస్ట్ ఓపెన్ సౌత్ ఇండియన్ కరాటే చాంపియన్‌షిప్‌లో కాగజ్‌నగర్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈ నెల 9, 10 తేదీల్లో ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో గల శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన కరాటే పోటీల్లో ఫాతిమా కాన్వెంట్, సెయింట్ క్లారిటీ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. స్పారింగ్ విభాగంలో కట్టుకూరి త్రినాథ్, కొయ్యాడ అశ్విత్, వినోద్ గోల్డ్ మెడల్, వినయ్ బ్రౌన్, నవనీత్ చంద్ర సిల్వర్ మెడల్ సాధించారు. వీరిని షటోరియో అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ కోషి విజయన్, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రవి, కుమురంభీం జిల్లా సెక్రెటరీ దేవయ్య అభినందించారు.

## రెండోరోజు 9,425 కుటుంబాల సర్వే



తుంపెల్లిలో సర్వే వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

**ఆసిఫాబాద్:** సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా రెండోరోజు ఆదివారం జిల్లాలో 9,425 కుటుంబాల సర్వే పూర్తిచేశారు. జిల్లాలోని 335 గ్రామ పంచాయతీలు, రెండు మున్సిపాలిటీల్లో మొత్తం 1,56,649 కుటుంబాలు ఉన్నాయి. తొలిరోజు ఈ నెల 9న 5,244 గృహాలు పూర్తిచేయగా.. రెండోరోజు సర్వేలో పురోగతి కనిపించింది. శని, ఆదివారాల్లో 14,669 గృహాలను సర్వే పూర్తి చేయగా, వీటిలో గ్రామీణ ప్రాంతాల్లో 12,904, అర్బన్ ప్రాంతాల్లో 1765 గృహాలు ఉన్నాయి.

**సర్వే వివరాలు సక్రమంగా సేకరించాలి**

**ఆసిఫాబాద్‌రూరల్:** సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా వివరాలు సక్రమంగా సేకరించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. ఆసిఫాబాద్ మండలం తుంపెల్లి గ్రామంలో కొనసాగుతున్న సర్వేను ఆదివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సమగ్ర సర్వే ప్రక్రియలో కుటుంబ సభ్యుల వివరాలు ఎలాంటి పొరపాట్లు లేకుండా స్పష్టంగా సేకరించాలన్నారు. ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన బ్లాకుల్లో పూర్తి స్థాయిలో వివరాలు నిర్ణీత నమూనాలో నమోదు చేయాలని సూచించారు. అనంతరం తుంపెల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు ప్రత్యేక శిబిరాన్ని సందర్శించారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. నూతన ఓటరు నమోదు, మార్పులు చేర్పులు, సవరణలు, తొలగింపుల కోసం ఈ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే, డీటీ పోచయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



కాగజ్‌నగర్‌లో సర్వే పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

**సర్వేను పరిశీలించిన సబ్ కలెక్టర్**

**కాగజ్‌నగర్‌రూరల్:** కాగజ్‌నగర్ పట్టణంలోని కాపువాడలో ఆదివారం నిర్వహించిన కుటుంబ సమగ్ర సర్వేను ఆదివారం సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా పరిశీలించారు. సర్వేలో ఎలాంటి తప్పులు జరగకుండా చూడాలని ఆదేశించారు. అదేవిధంగా సర్వే వేగంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## ‘పది’కి ప్రత్యేక ప్రణాళిక

- ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం
- ఈ వారం నుంచే ప్రత్యేక తరగతులు
- డిసెంబర్ 31లోగా సిలబస్ పూర్తి చేసేలా కార్యాచరణ
- పరీక్షలు రాయనున్న 6500 మంది విద్యార్థులు



జిల్లా కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థులు

**ఆసిఫాబాద్‌రూరల్:** పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధనకు విద్యాశాఖ ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ వారం నుంచే ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు సన్నద్ధమవుతోంది. గతేడాది ఉపాధ్యాయుల కొరతతో ఫలితాలు ఆశించిన మేర రాలేదు. ప్రస్తుతం నూతన నియామకాలు, పదోన్నతులతో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ అయ్యాయి. సకాలంలో సిలబస్ పూర్తి చేసి ఉపాధ్యాయులు రివిజన్‌పై దృష్టి సారించనున్నారు.

**నూతన టీచర్ల రాకతో..**

జిల్లావ్యాప్తంగా మొత్తం 272 ఉన్నత పాఠశాలలు ఉండగా.. వీటిలో డీఈవో పరిధిలో 77, ప్రైవేట్ స్కూల్స్ 34, గిరిజన ఆశ్రమ, బీసీ, ఎస్సీ, మైనార్టీ, ఎస్టీ, గురుకులాలు 171 ఉన్నాయి. సుమారు 6500 మంది విద్యార్థులు పదో తరగతి చదువుకుంటున్నారు. కొన్నేళ్లుగా పదో తరగతి వార్షిక ఫలితాల్లో జిల్లా చివరి నుంచి రెండు, మూడు స్థానాల్లో నిలుస్తోంది. విద్యాశాఖ అనేక చర్యలు తీసుకున్నా మార్పు రావడం లేదు. ఉపాధ్యాయుల కొరత ఉండటం, మారుమూల ప్రాంతాల్లో పనిచేసేందుకు కొందరు ఆసక్తి చూపకపోవడంతో ఉత్తీర్ణతలో విద్యార్థులు వెనుకబడ్డారనే విమర్శలు ఉన్నాయి. డీఎస్సీ ద్వారా నూతనంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 76 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ అయ్యాయి. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో భాగంగా మరో 320 మంది ఎస్జీటీల నుంచి ఎస్‌ఏలుగా ప్రమోషన్లు పొందారు. కొత్త టీచర్ల రాకతో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతమయ్యాయి. అలాగే 15 మండలాలకు ఇన్‌చార్జి ఎంఈవోలను కూడా నియమించారు. ప్రతిరోజూ ఎంఈవోలు రెండు పాఠశాలలను సందర్శించాలని ఆదేశాలు రావడంతో పర్యవేక్షణ పెరిగింది.

**రెగ్యులర్ డీఈవో లేరు..**


డీఈవోగా పనిచేసిన అశోక్ బదిలీపై వెళ్లడంతో ప్రస్తుతం మంచిర్యాల డీఈవో యాదయ్యకు అదనపు విద్యాధికారిగా బాధ్యతలు ఇచ్చారు. ఆయన కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా విద్యాధికారిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత నేటివరకు ఒక్క పాఠశాలను కూడా క్షేత్రస్థాయిలో సందర్శించలేదు. కార్యాలయానికి సంబంధించిన రికార్డులపై సంతకాల కోసం వచ్చివెళ్తున్నారు. అలాగే కలెక్టర్ నిర్వహించే సమీక్షా సమావేశాలకు మాత్రమే హాజరవుతున్నారు. పాఠశాలలు, ఉపాధ్యాయుల పని తీరుపై పర్యవేక్షణ కొరవడిందనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల మంత్రి సీతక్క జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా రెగ్యులర్ డీఈవోను నియమించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి కోరారు. అయినా ఇప్పటివరకు రెగ్యులర్ అధికారిని నియమించలేదు.

**ప్రణాళిక ఇలా..**

పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు ఇన్‌చార్జి డీఈవో ఉదయ్‌బాబు తెలిపారు. ఆయన ‘సాక్షి’కి కార్యాచరణను వివరించారు.

- జిల్లావ్యాప్తంగా డీఈవో పరిధిలోని 77 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సుమారు 3200 వేల మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు.
- ఈ వారం నుంచి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు ప్రత్యేక తరగతులు కొనసాగుతాయి. విద్యార్థులను గ్రూపులుగా విభజించి, ప్రతీ గ్రూప్‌నకు ఒక టీచర్‌ను కేటాయిస్తారు. ప్రతీ వారం సైకిలింగ్ టెస్టులు నిర్వహిస్తారు.
- డిసెంబర్ 31లోగా వందశాతం సిలబస్ పూర్తి చేస్తారు. సబ్జెక్టుల వారీగా ప్రత్యేక మాడ్యూల్ రూపొందించి జనవరి నుంచి అమలు చేసేలా కార్యాచరణ సిద్ధం చేశారు.
- బోధన పూర్తికాగానే పాఠ్యాంశానికి సంబంధించి ఉపాధ్యాయులు ప్రశ్నలు అడిగి, తరగతి గదిలోనే ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తారు.
- తరగతులకు సంబంధించిన ఫొటోలను పాఠశాలల వారీగా జిల్లాస్థాయి వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేస్తారు.
- జిల్లా విద్యాధికారితో పాటు సెక్టోరియల్ అధికారులు, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు తరగతుల నిర్వహణను పర్యవేక్షిస్తారు.
- ప్రతిరోజూ విద్యార్థులు పాఠశాలకు వచ్చేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలి. బడికి గైర్హాజరైన వారికి టీచర్లు ఫోన్ చేయాలి.

### వందశాతం ఉత్తీర్ణతకు చర్యలు



ఆదర్శ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ఒక గంటపాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు అన్నిచర్యలు తీసుకుంటున్నాం. సకాలంలో సిలబస్ పూర్తిచేసి, చదువులో వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారిస్తాం.

– మహేశ్వర్, ప్రిన్సిపాల్, ఆసిఫాబాద్ మోడల్ స్కూల్

### ఉత్తమ ఫలితాలు సాధిస్తాం



2024– 25 విద్యా సంవత్సరంలో పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు చర్యలు తీసుకుంటాం. స్కూల్ అసిస్టెంట్ల రాకతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన బోధన అందుతోంది. గత విద్యా సంవత్సరంలో వెనుకబడిన పాఠశాలలో దృష్టి సారించాం.

– యాదయ్య, డీఈవో

## సమ్మెకాలపు ఒప్పందాలు అమలు చేయాలి

**రెబ్బెన(ఆసిఫాబాద్):** సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ, సింగరేణి యాజమాన్యానికి మధ్య 2022 సెప్టెంబర్‌లో జరిగిన ఒప్పందాన్ని అమలుచేయాలని ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని గోలేటిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 2022లో యూనియన్ నాయకులు, సింగరేణి యాజమాన్యానికి జరిగిన ఒప్పందం ప్రకారం బెల్ట్ క్లీనింగ్, సేల్ పిక్కింగ్, బ్లాస్టింగ్, వర్క్‌షాప్‌ల్లో పనిచేసే కాంట్రాక్టు కార్మికులకు సెమీ స్కిల్డ్ వేతనాలు చెల్లించాలన్నారు. కన్వేయర్స్ డ్రైవర్లు, కోల్ శాంప్లింగ్, అండర్‌గ్రౌండ్ వర్కర్లకు స్కిల్డ్ వేతనాలు.. లారీ, వోల్వో డ్రైవర్లకు స్కిల్డ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రెండేళ్లు గడిచినా యాజమాన్యం ఒప్పందాలు అమలు చేయకుండా కార్మికులను శ్రమదోపిడీకి గురిచేస్తోందని అన్నారు. ప్రతినెలా కాంట్రాక్టు కార్మికులకు జీతం చిట్టీలు ఇవ్వాలని, సీఎంపీఎఫ్ వివరాలు తెలపాలని, సింగరేణిలో పనిచేసే రిటైర్డ్ అయిన కాంట్రాక్టు కార్మికులకు సీఎంపీఎఫ్‌తోపాటు ఇతర బెనిఫిట్స్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికుల కుటుంబ సభ్యులకు సైతం కార్పొరేట్ వైద్య సదుపాయం కల్పించాలని కోరారు.

## క్లుప్తంగా

### మానసికస్థితి సరిగా లేక వ్యక్తి ఆత్మహత్య



మృతదేహం వద్ద వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై సాయికుమార్



వినోద్ (ఫైల్)

**పెంబి:** మానసిక స్థితి సరిగా లేక వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై సాయికుమార్ కథనం ప్రకారం..మండలంలోని మందపల్లి గ్రామానికి చెందిన నముల్ల చిలుకవ్వ–లచ్చన్న దంపతులకు ముగ్గురు కుమారులు. చిన్నకుమారుడు నముల్ల వినోద్(27) చిన్నప్పటి నుంచి మానసిక స్థితి సరిగా లేదు. ఎలాంటి పనులు చేయడం లేదు. ఈక్రమంలో మనస్తాపం చెందాడు. శుక్రవారం తన పొలానికి వెళ్లి గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడు. తల్లి చిలుకవ్వ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మి, మూడేళ్ల కుమారుడు ఉన్నాడు.

### ఉరేసుకుని ఒకరు..



రాములు(ఫైల్)

**భైంసాటౌన్:** పట్టణంలోని బైల్‌బజార్ ప్రాంతానికి చెందిన బంటోల్ల రాములు(38) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పట్టణ ఎస్సై ఎండీ గౌసుద్దీన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం ..రాములు స్థానికంగా కూలీ పనులు చేసుకుంటున్నాడు. కొన్నేళ్ల క్రితం జరిగిన ప్రమాదంలో తలకు గాయమై అప్పటి నుంచి మతిస్థిమితం సరిగా లేక బాధపడుతున్నాడు. ఈక్రమంలో ఆదివారం భార్య సంగీత కూలీ పనులకు వెళ్లగా, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు అందించిన సమాచారంతో పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం ఏరియాస్పత్రికి తరలించారు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

### పురుగుల మందు తాగి యువకుడు..



సంతోష్ (ఫైల్)

**దిలావర్‌పూర్:** పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం ..మండలంలోని బన్సపల్లి గ్రామానికి చెందిన మస్త సంతోష్ (37)కు లోకేశ్వరం మండలం మన్మథ్ గ్రామానికి చెందిన స్వప్నతో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. ఈ దంపతులకు రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. భార్యభర్తల మధ్య మనస్పర్థలు వచ్చాయి. కుమారుడిని తీసుకుని భార్య కొన్నిరోజుల క్రితం పుట్టింటికి వెళ్లింది. ఈక్రమంలో భర్త మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 2న ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. గ్రామానికి ఆనుకుని ఉన్న పంటచేలో పురుగుల మందు తాగి మృతి చెందాడు. అక్కడ రైతులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఐదు రోజుల క్రితం పురుగుల మందు తాగి మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

### రేపు జిల్లాస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

**ఆదిలాబాద్:** జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఈనెల 12, 13వ తేదీల్లో వనవాసీ కల్యాణ్ పరిషత్ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ సభ్యులు అశోక్, నగేష్ ఓ ప్రకటనలో తెలిపారు. భగవాన్ బిర్సా ముండా జయంతిని పురస్కరించుకుని జిల్లాలోని ఆదివాసీ యువకుల క్రీడా నైపుణ్యాలను వెలికితీయాలనే ఉద్దేశంతో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం వరకు ఎంట్రీలు నమోదు చేసుకోవాలని, సాయంత్రం 5 గంటలకు డ్రా తీయనున్నట్లు తెలిపారు.

### దరఖాస్తు చేసుకోవాలి

**కాగజ్‌నగర్‌రూరల్:** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్‌యూనివర్సిటీలో 2024– 25 సంవత్సరానికి డిగ్రీలో ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్ పొందడానికి ఈ నెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, కోఆర్డినేటర్ దత్తాత్రేయ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 2019– 2023 సంవత్సరాల్లో అడ్మిషన్ తీసుకున్న రెండు, మూడో సంవత్సరం విద్యార్థులు ట్యూషన్ ఫీజు 15లోగా చెల్లించాలని పేర్కొన్నారు.

# ముగిసిన రాష్ట్రస్థాయి పోటీలు



మెదక్ జిల్లా జట్టుకు బహుమతి అందజేస్తున్న ఏసీపీ, డీఐఈవో

- సాఫ్ట్‌బాల్ బాల, బాలికల్లో మెదక్, నిజామాబాద్ జట్ల జయకేతనం
- హోరాహోరీగా ఫైనల్ మ్యాచ్‌లు
- విజేతలకు బహుమతుల ప్రదానం

**బెల్లంపల్లి:** బెల్లంపల్లి కేంద్రంగా రెండు రోజుల పాటు నిర్వహించిన 68వ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. సింగరేణి తిలక్ స్టేడియంలో ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్–19 విభాగంలో బాల,బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు 9 బాలుర, 9 బాలికల జట్లు హాజరయ్యాయి. ఫైనల్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. నువ్వా నేనా అనేరీతిలో క్రీడాకారులు పోటీపడగా బాలుర విభాగంలో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ద్వితీయస్థానంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు, తృతీయస్థానంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జట్టు నిలిచాయి. బాలికల విభాగంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు (ద్వితీయ), మహబూబ్‌నగర్ జిల్లా జట్టు (తృతీయ) స్థానాల్లో



నిజామాబాద్ జిల్లా జట్టుకు బహుమతి ఇస్తున్న ఏసీపీ, డీఐఈవో

నిలిచాయి.

**సత్తాచాటిన మెదక్, నిజామాబాద్ జిల్లాల జట్లు..**

సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాల జట్లు సత్తాచాటాయి. ఆది నుంచి ఆ రెండు జిల్లాల జట్లు పట్టుదలతో ఆడాయి. ఉమ్మడి మెదక్ జిల్లా బాలుర జట్టు పట్టు వీడకుండా ఆడి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా, అదే జిల్లాకు చెందిన బాలికల జట్టు ప్రత్యర్థి జట్టుతో తలపడి ద్వితీయ స్థానాన్ని దక్కించుకోవడం విశేషం. బాలికల విభాగంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జట్టు హోరాహోరీగా తలపడి ప్రథమస్థానాన్ని దక్కించుకోగా, అదే జిల్లాకు చెందిన బాలుర జట్టు తృతీయ స్థానంలో నిలిచి సత్తాచాటింది. ఈ పోటీల్లో మెదక్, నిజామాబాద్ జిల్లాల బాల,బాలికల జట్లు రెండేసి బహుమతులు దక్కించుకున్నాయి.

**బహుమతుల ప్రదానం**

తిలక్ స్టేడియంలో పోటీలు నిర్వహించగా పక్కనే ఉన్న బజారుఏరియా జెడ్పీ ఉన్నత పాఠశాలలో విజేతల జట్లకు ప్రదానోత్సవం జరిగింది. బెల్లంపల్లి ఏసీపీ ఏ.రవికుమార్, డీఐఈవో కె.అంజయ్య, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ ఎన్.దేవయ్య, తాండూర్ సీఐ కుమారస్వామిలు గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. సత్తా చాటిన క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో క్రీడా పోటీల పరిశీలకులు పీడీ గంగామోహన్, శంకరయ్య, కన్వీనర్ ఆదిలాబాద్ జిల్లా పీడీఎస్ స్వామి, ఉమ్మడి జిల్లా అండర్–19 ఎస్జీఎఫ్ సెక్రెటరి బాబురావు, నిర్వాహకులు రామ్మోహన్‌రావు, ఎండీ యాకూబ్, బండి రవి, ఎండీ చాంద్‌పాషా, ఎస్‌కే రాజ్‌మహ్మద్, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్, చిన్నక్క, యాదగిరి పాల్గొన్నారు.



ట్రెడిషనల్ బాలుర విభాగంలో విజేతగా నిలిచిన మహబూబ్‌నగర్ జట్టు



ఫాస్ట్‌–5 బాలికల విభాగంలో గెలుపొందిన నల్గొండ జట్టు

## నిర్మల్‌లో నెట్‌బాల్ పోటీలు

**నిర్మల్‌టౌన్:** జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఈనెల 8 నుంచి నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అండర్–16 సబ్ జూనియర్స్ బాల, బాలికల ఫాస్ట్–5, ట్రెడిషనల్ నెట్‌బాల్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. రాష్ట్రంలోని 24 జిల్లాల నుంచి 48 జట్లు, 850 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఫైనల్స్ ట్రెడిషనల్‌లో బాలుర విభాగంలో మహబూబ్‌నగర్–నారాయణపేట్ జట్లు తలపడగా మహబూబ్‌నగర్ జట్టు విజయం సాధించింది. బాలికల విభాగంలో ఫైనల్‌లో మహబూబ్‌నగర్ జట్టుపై నల్గొండ జట్టు గెలుపొందింది. ఫాస్ట్–5 ఫైనల్స్‌లో బాలుర విభాగంలో కరీంనగర్ జట్టును ఓడించి నారాయణపేట్ జట్టు విజయకేతనం ఎగురవేసింది. బాలికల విభాగంలో మహబూబ్‌నగర్–నల్గొండ జట్లు తలపడగా నల్గొండ జట్టు జయకేతనం ఎగురవేసింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, నెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విక్రమ్ ఆదిత్యరెడ్డి, ప్రముఖ వైద్యుడు అవినాష్‌లు విజేతలకు బహుమతులు అందజేశారు. నెట్‌బాల్ రాష్ట్ర సెక్రటరీ ఖాజాఖాన్, జిల్లా అధ్యక్షుడు అనిల్ కుమార్, సెక్రెటరీ మోహన్, ఎస్జీఎఫ్ సెక్రెటరీ రవీందర్‌గౌడ్, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా కార్యదర్శి భోజన్న, డాక్టర్ వేదవ్యాస్, ఆర్గనైజర్ వన్నెల భూమన్న, వ్యాయామ ఉపాధ్యాయులు జమున, అన్నపూర్ణ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

### పోగొట్టుకున్న పర్సు అప్పగింత



పర్సును అప్పగిస్తున్న అంజద్

**నస్పూర్:** పర్సు పోగొట్టుకున్న మహిళకు యువకుడు అప్పగించాడు. పట్టణంలోని సుందరయ్య కాలనీకి చెందిన సత్తమ్మ ఆదివారం సీసీసీ కార్నర్ వద్ద గల ఎస్బీఐ ఏటీఎం వద్దకు వెళ్లింది. నగదు విత్‌డ్రా చేసుకుని వెళ్తుండగా పర్సు అక్కడే పడిపోయింది. సీసీసీకి చెందిన అంజద్ ఏటీఎం వద్దకు వెళ్లగా దొరికింది. కొంతసేపటికి సత్తమ్మ రావడంతో తిరిగి పర్సు అప్పగించాడు. పర్సులో రూ.700 నగదు, రెండు బంగారు పుస్తెలు ఉన్నాయని తెలిపింది.

### పారిపోయిన 'ఆశ్రమ' విద్యార్థులు

**నర్సాపూర్(జి):** మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు పారిపోయారు. ఆదివారం ఎస్టీ హాస్టల్ నుంచి పారిపోయి బస్టాండ్‌కు చేరుకున్నారు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసు సిబ్బంది చౌహాన్ కృష్ణ, శ్రీనివాస్ అక్కడికి చేరుకుని విద్యార్థుల వివరాలు తెలుసుకున్నారు. 3, 6వ తరగతి చదువుతున్న వినీత్, వినాయక్, నితీశ్‌లను ఉపాధ్యాయులకు అప్పగించినట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు. చదువుపై ఆసక్తి లేకపోవడంతో విద్యార్థులు బయటికి వెళ్లినట్లు తెలిసింది.

# విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

- ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్
- టీయూటీఎఫ్ రాష్ట్ర విద్యా మహాసభలు

**ఆదిలాబాద్‌టౌన్:** విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని టీటీడీలో ఆదివారం టీయూటీఎఫ్ రాష్ట్ర 6వ మహాసభలు నిర్వహించారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఎస్ రద్దుకు కృషి చేస్తామన్నారు. జీవో 317తో నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేసేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. అసెంబ్లీతోపాటు పార్లమెంట్‌లో వారి సమస్యలపై ప్రస్తావిస్తామని తెలిపారు. సమాజంలో టీచర్ల పాత్ర కీలకమని, విద్యను నిర్లక్ష్యం చేస్తే అభివృద్ధికి ఆటంకం ఎదురవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి బడ్జెట్‌లో కేటాయించింది రూ.21 వేల కోట్లు అని, ఇందులో ఇప్పటివరకు రూ.380 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. కమీషన్లు వచ్చే వివిధ సర్వేలకు ప్రైవేట్ వ్యక్తులను కేటాయించిన సర్కారు, ఎలాంటి లాభాలు లేని వాటికి టీచర్లతో సర్వే చేయిస్తుందన్నారు. గత సీఎం కేసీఆర్ విద్యారంగంపై ఒక్కరోజు సమీక్ష నిర్వహించలేదని తెలిపారు.



మాట్లాడుతున్న ఎంపీ నగేశ్

సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లచ్చిరాం, రఘునందర్‌రెడ్డి మాట్లాడుతూ సీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. బకాయిలు ఉన్న ఐదు డీఏలకు గాను ఒక డీఏను మాత్రమే ప్రకటించడంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. పీఆర్సీ రిపోర్టును వెంటనే అమలు చేయాలన్నారు. పెండింగ్ బిల్లులను వెంటనే క్లియరెన్స్ చేయాలన్నారు. సర్వీస్ రూల్స్ సమస్య పరిష్కరించి ఎంఈవో, డైట్ లెక్చరర్, డిప్యూటీ డీఈవో, జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతులు కల్పించాలన్నారు. ఎస్టీటీ ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని తెలిపారు. డీఈవో ప్రణీత, రాష్ట్ర నాయకులు శ్రీనివాస్, మొగలయ్య, బేర దేవన్న, మురళిమనోహర్ రెడ్డి, సుజాత, కైలాసం, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్, జలంధర్‌రెడ్డి, జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

## అ'పూర్వ' సమ్మేళనం



**భీమారం:** మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1995–96 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. 29 ఏళ్ల తర్వాత వీరందరు పాఠశాలలో ఆదివారం జరిగిన అపూర్వ సమ్మేళనానికి హాజరయ్యారు. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. తీపి గుర్తులను నెమెరువేసుకున్నారు. రోజంతా సంతోషంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.



మందమర్రిలో..

**మందమర్రిరూరల్:** మందమర్రిలోని విజ్ఞాన్ స్కూల్‌లో 2000–01 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. సీఈఆర్ క్లబ్ ఆవరణలో జరిగిన అపూర్వ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం చేసుకుని యోగా క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో చిన్ననాటి స్మృతులు గుర్తుచేస్తున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానం చేశారు.

# వ్యాపారులు, లారీ ఓనర్స్ మధ్య లొల్లి

- లోకల్ లారీల్లోనే లోడ్ చేయాలని చెబుతున్న లారీ ఓనర్స్
- అడ్డుకుంటే చర్యలు తీసుకుంటామంటున్న పోలీసులు

**ఆదిలాబాద్‌టౌన్:** జిన్నింగ్ వ్యాపారులు, లారీ ఓనర్స్ అసోసియేషన్ మధ్య లొల్లి జరుగుతోంది. స్థానికంగా ఉన్న లారీల్లోనే పత్తి బేళ్లను లోడ్ చేయాలని చెబుతూ లారీ ఓనర్స్ అడ్డుకుంటున్నారని ప్రైవేట్ వ్యాపారులు చెబుతున్నారు. తమకు ఇతర రాష్ట్రాల లారీల యజమానులు తక్కువ ధరకు లోడ్ చేస్తుండగా, జిల్లా కేంద్రానికి చెందిన లారీ ఓనర్లు అధిక ధరతో లోడ్ చేస్తున్నారని పేర్కొంటున్నారు. అయితే, ఈ విషయం వారి మధ్య గొడవకు దారితీస్తోంది. తమకు ఎవరు తక్కువ ధరకు ట్రాన్స్‌పోర్ట్ చేస్తే వారికే లోడ్ చేస్తామని వ్యాపారులు స్పష్టం చేస్తున్నారు. లోడ్ చేసిన లారీలను అడ్డుకోవడం సరికాదని పేర్కొంటున్నారు. గత మూడేళ్లగా ఈవిధంగా చేస్తున్నారని జిన్నింగ్ అసోసియేషన్ నాయకులు చెబుతున్నారు. ఈ పంచాయితీ పోలీసుల వద్దకు చేరింది. జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ అసోసియేషన్, లారీ ఓనర్స్ అసోసియేషన్, ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్ సభ్యులతో ఆదివారం జిల్లా కేంద్రంలో డీఎస్పీ జీవన్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. జిన్నింగ్ వ్యాపారులు మాట్లాడుతూ గుంటూరుకు పత్తి బేళ్లను తరలించేందుకు ఇతర రాష్ట్రాలకు చెందిన లారీల యజమానులు రూ.35 వేలకు తీసుకెళ్తే, జిల్లా కేంద్రానికి చెందిన లారీ యజమానులు రూ.42 వేలు అడుగుతున్నారని తెలిపారు. ఇతర రాష్ట్రాల లారీల్లో లోడ్ చేస్తే లారీ అసోసియేషన్‌కు రూ.1220, జిల్లాకు చెందిన లారీల్లో లోడ్ చేస్తే అసోసియేషన్‌కు రూ.220 చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నారని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన 20 లారీల్లో లోడ్ చేస్తే రోజుకు రూ.20 వేలు ఎలా చెల్లిస్తామని వాపోయారు. ఇతర రాష్ట్రాల విధంగానే రూ.35 వేలకు లోడ్ చేస్తే స్థానిక లారీల్లోనే లోడ్ చేయించి అద్దె చెల్లిస్తామని స్పష్టం చేశారు. తాము లోడ్ చేసిన వాహనాలను కొందరు లారీ అసోసియేషన్ వారు అడ్డుకుంటున్నారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

తమిళనాడుకు బేళ్లను తరలించేందుకు ఇతర రాష్ట్రాల లారీలు రూ.60 వేలు తీసుకుంటుంటే, స్థానిక లారీ యజమానులు రూ.70 వేల నుంచి రూ.80 వేలు అద్దె అడుగుతున్నారని పేర్కొన్నారు. దీంతో తమపై అదనపు భారం పడుతుందన్నారు. ఇదిలా ఉండగా, డీజిల్ ధర పెరగడం, అద్దె గిట్టుబాటు కావడం లేదని లారీ యజమానులు పేర్కొన్నారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలకు చెందిన లారీలను అడ్డుకోవద్దని, అలా చేస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏవైన సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో వన్‌టౌన్, టూటౌన్, ట్రాఫిక్ సీఐలు సునీల్ కుమార్, కరుణకార్‌రావు, ప్రణయ్ పాల్గొన్నారు.

# అన్నవరానికి దీటుగా గూడెం అభివృద్ధి

- ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు
- కలెక్టర్‌తో కలిసి వ్రతమండపం ప్రారంభం

**దండేపల్లి:** మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయాన్ని అన్నవరానికి దీటుగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. ఆలయం వద్ద దాతల సహకారంతో నిర్మించిన వ్రతమండపాన్ని కలెక్టర్ కుమార్‌దీపక్‌తో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గూడెం సత్యదేవుడి ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు. ఇక్కడికి వచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పిస్తామన్నారు. వచ్చే కార్తికపౌర్ణమి వరకు కాటేజీల నిర్మాణంతోపాటు గూడెం గోదావరి నదితీరం వద్ద స్నానఘట్టాలు నిర్మిస్తామని తెలిపారు. అంతకుముందు ఎమ్మెల్యే, కలెక్టర్‌కు ఈవో శ్రీనివాస్, అర్చకులు, సిబ్బంది ఘనస్వాగతం పలికారు. దర్శనం అనంతరం వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. వ్రతమండప దాతలను సన్మానించారు. కార్యక్రమంలో డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాశ్, సీఐ నరేందర్, ఎస్సై ఉదయ్‌కిరణ్, తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో ప్రసాద్, ప్రత్యేకాధికారి రవీందర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

**గూడెంలో భక్తుల రద్దీ**

కార్తికమాసం సందర్భంగా గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఆదివారం అధిక సంఖ్యలో తరలివచ్చి సత్యదేవున్ని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. 534 జంటలు సామూహిక సత్యనారాయణవ్రతాలు నోముకున్నారు.



వ్రతమండపాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్



సత్యదేవున్ని దర్శించుకుంటున్న భక్తులు

### 'గిరిజన విద్యార్థులపై సవతి ప్రేమ'

**నార్నూర్:** ఏజెన్సీలో ఆదివాసీ గిరిజన విద్యార్థులపై ఐటీడీఏ అధికారులు సవతి ప్రేమ చూపిస్తున్నారని రాయిసెంటర్ జిల్లా సార్‌మేడి మెస్రం దుర్గు పటేల్ తెలిపారు. గాదిగూడ మండలంలోని పున్నగూడ, రుప్పాపూర్, శివనూర్, అర్లిగూడ, సెద్వాయి కొలాంగూడ, మారేగాం, హీరాపూర్, చిన్నకుండి, కొత్తపల్లి(జి) గ్రామాల్లో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్కా బాపురావుతో కలిసి ఆదివారం పర్యటించారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మారుమూల మండలం కావడంతో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంపై అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు ఏడు పాఠశాలల్లో టీచర్లు లేకపోవడంతో వందకు పైగా విద్యార్థులు నిరక్ష్యరాసులుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. టీచర్లు ఉన్నచోట పాఠశాల భవనాలు లేవన్నారు. భవనాలు ఉన్న చోట ఉపాధ్యాయులు లేరన్నారు. ఉన్నతాధికారులు వెంటనే ఉపాధ్యాయులను నియమించాలన్నారు. వారివెంట తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడు కనక ప్రభాకర్, ఆదివాసీ గిరిజన విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెందూర్ సంతోష్ తదితరులు ఉన్నారు.

### ఆందోళనలో 'ప్రైవేట్' గార్డులు

- విధుల్లోకి తీసుకోని యాజమాన్యం
- ముగిసిన కాంట్రాక్టర్ కాలపరిమితి



మందమర్రిలోని సింగరేణి ఎస్అండ్‌పీసీ ఆఫీస్

**మందమర్రిరూరల్:** మందమర్రి ఏరియాలోని 46 మంది ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులను యాజమాన్యం విధులకు తీసుకోవడం లేదు. సుమారు 15 రోజులుగా వారు ఆందోళన చెందుతున్నారు. ఇదివరకు వారికి పనులు చెప్పిన కాంట్రాక్టర్ కాల పరిమితి గతనెల 27తో ముగిసింది. అంతకుముందే యాజమాన్యం మరో కాంట్రాక్టర్ కోసం టెండర్ పిలువగా మురళి మ్యాన్‌పవర్ ఏజెన్సీకి టెండర్ దక్కినట్లు సమాచారం. టెండర్‌దారు ఎలాంటి చార్జ్ తీసుకోకపోవడంతో ప్రైవేట్ సెక్యూరిటీగార్డుల విధుల పంపిణీ జరగలేదు. గతంలో సింగరేణి యాజమాన్యం సీఐఎస్ఎఫ్ సిబ్బంది తొలగించిన అనంతరం టెండర్ ద్వారా నాలుగేళ్ల క్రితం 22 మంది ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులను తీసుకుంది. మొదట సేఫ్ సెక్యూరిటీ, తర్వాత రెడ్డి బ్రదర్స్ కాంట్రాక్టర్‌గా వ్యవహరించారు. వారి కాలపరిమితి పూర్తవడంతో కొత్తవారికి ఇవ్వాల్సి ఉండగా ఇంతవరకు ఎవరూ రావడం లేదు. ఇదిలా ఉంటే, కొత్త కాంట్రాక్టర్ వచ్చేవరకు రెడ్డి బ్రదర్స్‌కే కేటాయిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**తొలగించే ప్రయత్నం!**

సింగరేణి యాజమాన్యం ప్రైవేట్ సెక్యూరిటీని తొలగించే ప్రయత్నంలో భాగంగానే వారిని విధులకు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఏరియాలో ఫీమేల్ మజ్దూర్ ఉద్యోగులు ఎక్కువగా ఉండడం వల్ల ప్రైవేట్ సెక్యూరిటీ స్థానంలో వారినే భర్తీ చేసే ప్రయత్నం చేస్తున్నట్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.